క్లుప్తంగా

కాల్వశ్రీరాంపూర్ ఠాణా ఆకస్మిక తనిఖీ



మాట్లాడుతున్న ఏసీపీ ఎడ్ల మహేశ్

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ ఠాణాను ఏసీపీ ఎడ్ల మహేశ్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఠాణా పరిధిలో జరిగిన నేరాలపై రివ్యూ చేశారు. మావోయిస్టు ప్రాబల్యంపై ఠాణా పరిధిలో అజ్ఞాతంలో ఉన్న వారి విషయంపై ఆరా తీశారు. మండలంలోని కిష్టంపేటకు చెందిన మావోయిస్టు నేత కంకణాల రాజిరెడ్డి ఉరఫ్ వెంకటేశ్ కుటుంబ సభ్యులు తల్లి ఆరోగ్య విషయం గురించి తెలుసుకున్నారు. అనంతరం ఏసీపీ విలేకరులతో మాట్లాడారు. కాల్వశ్రీరాంపూర్‌లో దసరా ఉత్సవాల స్థల వివాదం గ్రామస్తుల సహకారంతో ఇరువర్గాల సంఘీభావంతో ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. ఈ విషయమై గ్రామస్తులతో మరోసారి సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. ఎలాంటి ఘర్షణలకు తావులేకుండా పరిష్కరించుకునేందుకు అన్నివర్గాల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. సుల్తానాబాద్ సీఐ జగదీశ్, కాల్వశ్రీరాంపూర్ ఎస్సై శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ

జూలపల్లి: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను బుధవారం పెద్దపల్లి ఏసీపీ ఎడ్ల మహేశ్ తనిఖీ చేశారు. కేసుల రికార్డులను, ఠాణాలో పరిసరాలను పరిశీలించి సూచనలు చేశారు. సుల్తానాబాద్ సీఐ జగదీశ్, ఎస్సై వెంకటకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

ప్రజాపాలనను వినియోగించుకోవాలి

సుల్తానాబాద్: ఈనెల 28 నుంచి జనవరి 6 వరకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్పీ రాజయ్యగౌడ్ ప్రజలను కోరారు. బుధవారం స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు గ్యారంటీల అమలుకు ప్రజాపాలన సదస్సులో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. మహాలక్ష్మి, రైతు భరోసా, గృహలక్ష్మి, ఇందిరమ్మ ఇల్లు, సంక్షేమ పథకాలతో పాటు నూతన రేషన్ కార్డులు అర్హులైన లబ్ధిదారులు వినియోగించుకోవాలని సూచించారు.

ఆర్థిక చేయూత



డిపాజిట్ పత్రం ఇస్తున్న పూర్వ విద్యార్థులు

పాలకుర్తి: ఆపదలో ఉన్న చిన్ననాటి స్నేహితురాలికి ఆర్థికచేయూత అందించారు బసంత్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2000-01 బ్యాచ్ విద్యార్థులు. బసంత్‌నగర్‌కు చెందిన అదే బ్యాచ్ విద్యార్థి సున్నం ప్రభావతి భర్త మల్లేశ్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. ప్రభావతి ఆర్థిక పరిస్థితి గురించి తెలిసిన ఆమె చిన్ననాటి మిత్రులు ఆమె పేరు మీద రూ.50వేల ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. బుధవారం సంబంధిత పత్రాలను అందజేశారు. పూర్వ విద్యార్థులు సూర సమ్మయ్య, మహ్మద్ ఇబ్రహీం, రవి, సర్వ శ్రీనివాస్, చారి, రమాదేవి, హసీనా, సునీత, స్రవంతి, రాజేశ్వరి, వసంత, సుమలత, కరుణ, శారద ఉన్నారు.

లేబర్ ఇన్సూరెన్స్ కార్డుల పంపిణీ



కార్డులు పంపిణీ చేస్తున్న స్వామి

రామగిరి: మండలంలోని కల్వచర్ల గ్రామానికి చెందిన సెంట్రింగ్ కార్మికులకు బుధవారం భవన నిర్మాణ కార్మిక సమైక్య సంఘం జిల్లా అధ్యక్షుడు చిలువేరి స్వామి లేబర్ ఇన్సూరెన్స్ కార్డులు పంపిణీ చేశారు. తన సొంత ఖర్చులతో ఇన్సూరెన్స్ కట్టి లేబర్ ఇన్సూరెన్స్ కార్డులను అందజేసినట్లు ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరూ లేబర్ ఇన్సూరెన్స్ కార్డు తీసుకోవాలని సూచించారు.

30న ఈజీఎస్ ప్రజావేదిక

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండల పరిషత్ కార్యాలయంలో 30న ఈజీఎస్ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజు తెలిపారు. 2021 డిసెంబర్ 1 నుంచి 2023 మార్చి31 వరకు జరిగిన పనులపై సామాజిక తనిఖీ బృందాలు గ్రామసభలు నిర్వహించి తనిఖీలు పూర్తి చేసిన తర్వాత ప్రజావేదిక ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అద్దె ఇళ్లలో ఆరోగ్య ఉపకేంద్రాలు

- కనీస వసతులు కరువు
- సొంత భవనాలకు నిధులు మంజూరు చేయాలని కోరుతున్న సర్పంచులు



తెలుకుంటలో అద్దె ఇంట్లో ఆరోగ్య ఉపకేంద్రం (ఫైల్)

జూలపల్లి: గ్రామాల్లో చిన్నారులకు, గర్భిణులకు ప్రతి వారం సొంత ఊరిలోనే ఏఎన్‌ఎంలు ఆరోగ్య సేవలు అందించేందుకు రెండు, మూడు గ్రామాలకు ఒకటి చొప్పున ఆరోగ్య ఉపకేంద్రాలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో చిన్నారులకు పోలియో చుక్కలు, టీకాలు, గర్భిణులకు టీకాలు, మందులు, నెలవారీగా పరీక్షలు చేసి సూచనలు చేయాల్సి ఉంటుంది. కానీ ఉప కేంద్రాలకు సొంత భవనాలు లేక కనీస వసతులు కరువై ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మండలంలో 5ఆరోగ్య ఉపకేంద్రాలు..

మండల కేంద్రంతో పాటు 13 గ్రామ పంచాయతీల పరిధిలో 5 ఆరోగ్య ఉపకేంద్రాలను ఏర్పాటు చేశారు. జూలపల్లి, తేలుకుంట, పెద్దాపూర్, వడ్కాపూర్, వెంకట్రావుపల్లె గ్రామాల్లో ఏర్పాటు చేశారు. ఏ గ్రామంలో కూడా వీటికి సొంత భవనం లేదు. కొన్నినెలలు గ్రామపంచాయతీల్లో నిర్వహించినా.. గదులు సరిపోక, పంచాయతీ విధులకు ఇబ్బంది కలగడంతో అద్దె ఇళ్లు తీసుకోవాల్సి వస్తోందని ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు చెప్తున్నారు. అద్దె ఇళ్లలో కనీస సౌకర్యాలు లేక అవస్థలు తప్పడం లేదు. ప్రభుత్వం అద్దె ఇంటికి రూ.200 మాత్రమే ఇస్తుంది, ఈ అద్దెకు గ్రామంలో ఇల్లు దొరకడం లేదు. ఈ అద్దె కూడా ఏడాదికో, రెండేళ్లకో ఇస్తున్నట్లు ఏఎన్‌ఎంలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక గ్రామంలో చిన్నారులకు, గర్భిణులకు తప్పకుండా సేవలు అందించాల్సి ఉండడంతో తప్పని పరిస్థితిలో ఎక్కువ అద్దెకు ఇళ్లను తీసుకోవాల్సి వస్తోందని వారు పేర్కొంటున్నారు. సొంత భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినా, మంజూరు చేస్తున్నట్లు చెప్పడమే కానీ నిధులు మాత్రం విడుదల చేయడం లేదు. ఇప్పటికైనా ఆరోగ్య ఉపకేంద్రాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని సర్పంచులు, మండల ప్రజలు కోరుతున్నారు.

నిధులు మంజూరు చేయాలి



ఆరోగ్య ఉపకేంద్రాలకు సొంత భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి. సొంత భవనాలు, వసతులు లేక చిన్నారులు, గర్భిణులు ఇబ్బంది పడుతున్నారు.

– బంటు ఎల్లయ్య, సర్పంచ్, కాచాపూర్

ఇదివరకే అంచనాలు సిద్ధం



ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న ఐదు ఆరోగ్య ఉపకేంద్రాలకు త్వరలోనే నిధులు మంజూరు చేయిస్తా. ఇదివరకే అంచనాలు సిద్ధంచేశాం. నిధులు మంజూరు రాగానే నిర్మాణ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం.

– కూసుకుంట్ల రమాదేవి, ఎంపీపీ, జూలపల్లి

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినం



ఆరోగ్య ఉప కేంద్రాల నిర్మాణం, గ్రామీణ ప్రజలకు చికిత్సలో వీటి ప్రాధాన్యతను ఇప్పటికే ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినం. త్వరలోనే నిధులు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

– సంపత్‌రెడ్డి, మండల వైద్యాధికారి, జూలపల్లి

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఎలిగేడు: పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం అహర్నిషలు పాటుపడుతుందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మండల కేంద్రంలోని మధుర ఫంక్షన్ హాల్‌లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ఆరు గ్యారంటీ పథకాలను కచ్చితంగా అమలు చేస్తామని తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 46మంది లబ్ధిదారులకు రూ.46లక్షల విలువ గల కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.

ఎమ్మెల్యేకు సన్మానం

పెద్దపల్లి ఎమ్మెల్యేగా గెలిచి, ప్రమాణస్వీకారం చేసిన అనంతరం మొదటిసారిగా ఎలిగేడుకు వచ్చిన ఎమ్మెల్యే విజయరమణారావుకు కాంగ్రెస్ శ్రేణులు స్వాగతం పలికారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో సత్కరించారు. తహసీల్దార్ జె.స్వర్ణ, జెడ్పీ వైస్‌చైర్ పర్సన్ మండిగ రేణుక, ఎంపీపీ తానిపర్తి స్రవంతి, సర్పంచ్ భూర్ల సింధూజ, ఉపసర్పంచ్ కోరుకంటి వెంకటేశ్వర్‌రావు, మండల కోఆప్షన్ సభ్యులు ఎండీ.ఖలీల్, సింగిల్‌విండో చైర్మన్ గోపు విజయభాస్కర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర యూత్ కార్యదర్శి దుగ్యాల సంతోష్‌రావు, నాయకులు పొల్సాని పుల్లారావు, బాలుసాని పర్శరాములుగౌడ్, భూర్ల వెంకటసత్యం, బాసంపల్లి కొండయ్య, అమ్ముల శ్రీనివాస్, నరహరి సుధాకర్‌రెడ్డి, రాయమల్లు పాల్గొన్నారు.

చివరి భూములకు సాగునీరందిస్తా

ఓదెల: నియోజకవర్గంలో రైతుల చివరి భూముల సాగుకోసం ఎస్సారెస్పీ నీరందిస్తానని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు అన్నారు. బుధవారం మండలంలోని పిట్టలఎల్లయ్యపల్లె గ్రామంలో జీపీ భవనం నిర్మాణం, సీసీరోడ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాబోయే సీజన్‌లో రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం కటింగ్ లేకుండా మిల్లర్లతో కొనుగోలు చేస్తానన్నారు. పిట్టలఎల్లయ్యపల్లెకు ఆర్టీసీ బస్సును నడిపిస్తానన్నారు. మొదటిసారిగా వచ్చిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. సర్పంచ్ పిట్టల సరిత రవికుమార్, పొత్కపల్లి సింగిల్‌విండో మాజీ చైర్మన్ గోపు నారాయణరెడ్డి, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బైరి రవిగౌడ్, మాజీ వైస్ ఎంపీపీ అంబాల కొమురయ్య, జిల్లా నాయకులు చీకట్ల మొండయ్య, నాయకులు చొప్పరి రాజయ్య, కందుల అశోక్, సమ్మయ్య, కొమురయ్య, కార్యదర్శి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

జీపీ భవనానికి 2గుంటల స్థలం విరాళం

మండలంలోని పిట్టలఎల్లయ్యపల్లె పంచాయతీ పక్కా భవనానికి రెండుగుంటల స్థలాన్ని మాజీ వైస్ ఎంపీపీ పిట్టల రవికుమార్ విరాళంగా అందించారు. గ్రామస్తులు, ఎమ్మెల్యే ఆయనను అభినందించారు.

కనుల పండువగా అయ్యప్పస్వామి శోభాయాత్ర



అయ్యప్పస్వాముల నృత్యం



శోభాయాత్రలో స్వాములు

మంథని: పట్టణంలో బుధవారం అయ్యప్పస్వామి శోభాయాత్ర కనుల పండువగా నిర్వహించారు. ఆలయంలో ఆరట్టు మహోత్సవం నిర్వహించి గోదావరి నది తీరంలో చక్రస్నానం నిర్వహించారు. అనంతరం మంథని పురవీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. పూజారులు నాగేంద్ర శర్మ, భద్రయ్య, అయ్యప్ప స్వాములు వొడ్నాల శ్రీనివాస్, ఎంఎస్ రెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

బసంత్‌నగర్‌లో..

పాలకుర్తి: బసంత్‌నగర్‌లోని శ్రీఅయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం అయ్యప్ప మాలధారణ భక్తుల ఆధ్వర్యంలో మండల పూజ నిర్వహించారు. ఆలయ అర్చకులు రఘునాథ్, ప్రసాద్ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహంతో శోభాయాత్ర నిర్వహించారు. స్థానిక కోదండ రామాలయం నుంచి ప్రారంభమైన శోభాయాత్రలో అయ్యప్పస్వాములు యాత్రను రాంనగర్, కృష్ణానగర్ మీదుగా కొనసాగించారు. అనంతరం పాలకుర్తి మండల పాత్రికేయుల ఆధ్వర్యంలో స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. సాయంత్రం ఆలయంలో అయ్యప్పస్వామి పడిపూజ నిర్వహించారు.

ఆలయంలో మహా పడిపూజ



హోమంలో ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో బుధవారం మహా పడిపూజ, శ్రీమహాగణపతి హోమయజ్ఞం నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్యే విజయరమణారావు పాల్గొన్నారు. ఉదయం హోమయజ్ఞం, సాయంకాలం మహా పడిపూజ నిర్వహించారు.

ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణకు ఏర్పాట్లు



సుల్తానాబాద్: మాట్లాడుతున్న ఎంపీడీవో శశికళ



కమాన్‌పూర్: ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

సుల్తానాబాద్: ప్రజలందరూ ప్రజాపాలనను వినియోగించుకోవాలని సుల్తానాబాద్ ఎంపీడీవో శశికళ కోరారు. బుధవారం సమావేశం నిర్వహించారు. ఎంపీపీ బాలాజీరావు, ఎస్సై విజేందర్, ఎంపీడీవో ఫయాజ్ అలీ, మండల ప్రత్యేక అధికారులు రవీందర్‌రెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ సమావేశం..

సుల్తానాబాద్ మున్సిపల్ కార్యాలయం ఆవరణలో, పద్మనాయక కల్యాణ మండపంలో ప్రజాపాలన కార్యక్రమం ప్రారంభించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే విజయరమణారావు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు.

కమాన్‌పూర్: మండలంలోని గుండారం గ్రామంలో గురువారం ప్రభుత్వం నిర్వహించే ప్రజాపాలన ఏర్పాట్లను మంథని డీఎల్‌పీవో రాంబాబు పరిశీలించారు. దరఖాస్తులు స్వీకరణకు ఏర్పాట్లు చేపడుతున్నట్లు డీఎల్‌పీవో తెలిపారు. సర్పంచ్ ఓదెలు, ఎంపీవో శేషయ్యసూరి, కార్యదర్శి నరేశ్ ఉన్నారు.

సమష్టిగా పనిచేయాలి

ముత్తారం: ప్రజాపాలన విజయవంతం కోసం ప్రతి ఒక్కరూ సమష్టిగా పనిచేయాలని మండల ప్రత్యేకాధికారి ప్రవీణ్‌కుమార్ సూచించారు. బుధవారం సాయంత్రం ముత్తారం ఎంపీడీవో కార్యాలయంలో వివిధశాఖల అధికారులకు నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. మండలంలోని 14గ్రామ పంచాయతీల్లో గురువారం నుంచి జనవరి 6వరకు జరిగే ప్రజాపాలన గ్రామసభలో లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని, అర్హులు, అనర్హులని చెప్పకూడదన్నారు. ప్రజాపాలన దరఖాస్తులను ఇంటింటికీ పంపిణీ చేయలన్నారు. మండలంలో తహసీల్దార్, ఎంపీడీవోలు టీమ్ లీడర్లుగా వ్యవహరిస్తూ వారి ఆధ్వర్యంలో రెండు బృందాల పర్యవేక్షణ ఉంటుందన్నారు. మొదటిరోజు ఓడేడ్‌లో జరిగే ప్రజాపాలన కార్యక్రమానికి 8కౌంటర్లతో పాటు హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామని తెలిపారు. అనంతరం ఓడేడ్‌లో కౌంటర్ల ఏర్పాట్లను పరిశీలించారు. మంథని డీఎల్‌పీవో రాంబాబు, తహసీల్దార్ బండి రాజేశ్వరి, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో బైరీ వేణుమాధవ్, అధికారులు పాల్గొన్నారు.

ఏర్పాట్లు చేయాలి

కమాన్‌పూర్: ప్రజాపాలన కార్యక్రమానికి గ్రామాల్లో ఏర్పాట్లు చేయాలని మండల ప్రత్యేకాధికారి రహఫ్‌ఖాన్ అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇబ్బందులు లేకుండా కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఎంపీడీవో విజయ్‌కుమార్, తహసీల్దార్ రామ్మోహన్‌రెడ్డి, ఎంపీవో శేషయ్యసూరి, డిప్యూటీ తహసీల్దార్ కోటేశ్వర్ పాల్గొన్నారు.

జూలపల్లి: మండలంలోని గ్రామాల్లో నిర్వహించే ప్రజాపాలన గ్రామసభలను విజయవంతం చేయాలని ఎంపీడీవో వేణుగోపాలరావు సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారుల సమావేశం నిర్వహించారు.

ఎలిగేడు: మండలపరిషత్ కార్యాలయంలో సన్నాహక సమావేశం జరిగింది. ప్రజాపాలనలో ఆరు గ్యారంటీలపై దరఖాస్తుల స్వీకరణపై సలహాలు, సూచనలు చేశారు. మండల ప్రత్యేక అధికారి తిరుపతిరావు, ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, తహసీల్దార్ స్వర్ణ, ఎంపీవో అనిల్‌రెడ్డి, డీటీ కిరణ్, వివిధశాఖల అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజాపాలన విజయవంతం చేయండి

ఓదెల: మండలంలో ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో జి.సత్తయ్య సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీపీ కునారపు రేణుకదేవి, జెడ్పీటీసీ గంట రాములు, తహసీల్దార్ యాకన్న, పీఆర్ ఏఈఈ సమ్మిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ వెంకన్న, కార్యదర్శులు భానుప్రసాద్, శ్రీకాంత్, ఆవుల శ్రీనివాస్ సతీశ్, దిలీప్, మీరా పాల్గొన్నారు.

108 కలశాలతో అభిషేకం



ప్రత్యేక పూజలు చేస్తున్న పండితులు

యైటింక్లయిన్‌కాలనీ: శ్రీఅయ్యప్ప స్వామి మండల పూజమహోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ అయ్యప్ప ఆలయంలో స్వామి మూలవిరాట్‌కు 108 కలశాలతో అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని గణపతి, నాగరాజు, సుబ్రహ్మణ్యస్వామి, అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు భక్తులకు హారతి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదానం చేశారు. ఆలయ ప్రధాన గురుస్వామి శ్రీఅద్దెంకి సారంగచారి గురుస్వామి, ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, కమిటీ సభ్యులు, అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

వారంబందీ ద్వారా సాగునీరు



సుల్తానాబాద్‌కు చేరిన ఎస్సారెస్పీ నీరు

సుల్తానాబాద్: ఎస్సారెస్పీ కాలువల ద్వారా సాగుకు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ద్వారా అధికారులు నీటిని విడుదల చేశారు. బుధవారం సుల్తానాబాద్‌కు చేరాయి. నియోజకవర్గంలో డి-83, 86 కెనాల్ ద్వారా సాగునీరుకు ఎస్సారెస్పీ ద్వారా నీటిని విడుదల చేయాలని ఎమ్మెల్యే విజయరమణారావు ఇటీవల ఈఎంసీ వెంకటేశ్వర్లను కలిసి కోరిన విషయం తెలిసిందే. వారబందీ ద్వారా నీటిని విడుదల చేసేందుకు అధికారులు హామీ మేరకు విడుదల చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కాల్వశ్రీరాంపూర్, ఓదెల మండలాల రైతులు నీటిని వినియోగించిన తర్వాతే సుల్తానాబాద్, జూలపల్లి, ఎలిగేడు, పెద్దపల్లి మండలాలకు వినియోగించుకునేలా కెనాల్ గస్తీకి లస్కర్లు తిరగనున్నట్లు అధికారులు తెలిపారు.

ప్రతీ దరఖాస్తు స్వీకరించాలి



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి సాయినాథ్

రామగిరి: ప్రజాపాలనలో భాగంగా ప్రభుత్వ పథకాల కోసం ప్రజల నుంచి వచ్చే ప్రతి ఒక్క దరఖాస్తు స్వీకరించాలని జిల్లా మైనింగ్ అధికారి, మండల ప్రత్యేకాధికారి సాయినాథ్ ఆదేశించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో తహసీల్దార్, ఎంపీడీవో, ఎంపీపీ, గ్రామ ప్రత్యేకాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ఇచ్చిన దరఖాస్తులు మాత్రమే స్వీకరించాలని జిరాక్స్‌లు స్వీకరించొద్దని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ బి.రాంచందర్‌రావు, ఎంపీపీ ఆరెల్లి దేవక్క, ఎంపీడీవో రమేశ్, ఎంపీవో కాటం భాస్కర్, ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

రామగుండం: గ్రామాల్లో ప్రజాపాలన గ్రామసభలు కొనసాగనున్న నేపథ్యంలో ఆరు గ్యారంటీ పథకాలకు దరఖాస్తు చేసుకునే అవకాశం రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని తహసీల్దార్ కుమారస్వామి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం గ్యారంటీలకు దరఖాస్తు చేసుకునే అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు ఫారానికి జతపరచాల్సిన ధృవీకరణపత్రాల వివరాలను వెల్లడించారు.

ప్రత్యేక బస్సులు నడపాలి



వినతిపత్రం ఇస్తున్న ఏబీవీపీ నాయకులు

గోదావరిఖనిటౌన్: విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులు నడపాలని ఏబీవీపీ పెద్దపల్లి జిల్లా శాఖ ఆధ్వర్యంలో గోదావరిఖని ఆర్టీసీ డిపో మేనేజర్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా కన్వీనర్ బండి రాజశేఖర్ మాట్లాడుతూ బస్సులు సమయానికి రాకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. బస్సుల్లో సామర్థ్యానికి మించి ప్రయాణం చేయడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. పాఠశాలలు, కళాశాలల సమయానికి అనుకూలంగా బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్, రవికుమార్, శశికుమార్ పాల్గొన్నారు.

పైప్‌లైన్ లీకేజీ పనులకు మరమ్మతు



మరమ్మతు పనులు ప్రారంభించిన సిబ్బంది

జ్యోతినగర్: తాగునీటి పైప్‌లైన్ లీకేజీ పనులను మున్సిపల్‌శాఖ అధికారులు బుధవారం ప్రారంభించారు. రామగుండం కార్పొరేషన్ నాలుగో డివిజన్ కృష్ణానగర్‌లో కొద్ది రోజులుగా పైప్‌లైన్ లీకేజీతో రోడ్డంతా నీరు నిలిచి బురదమయంగా మారింది. దీంతో మాజీ కౌన్సిలర్ మామిడాల చంద్రయ్య ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్ అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం నిరసన దీక్ష చేయనున్నట్లు ఇటీవల ప్రకటించారు. ఈక్రమంలో మున్సిపల్ అధికారులు పైప్‌లైన్ లీకేజీ మరమ్మతు పనులు చేపట్టారు.

అన్నిదానాల కన్నా నేత్రదానం గొప్పది



అభినందన పత్రం అందిస్తున్న డాక్టర్ లక్ష్మీవాణి

కోల్‌సిటీ: అన్నిదానాల్లో కంటే నేత్రదానం చాలా గొప్పదానమని మగువ లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు, డాక్టర్ టి.లక్ష్మీవాణి అన్నారు. గోదావరిఖని అశోక్‌నగర్‌కు చెందిన వేముల నారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా కుటుంబ సభ్యులు ఆయన నేత్రాలను దానం చేసి ఇద్దరికి చూపును ప్రసాదించారు. ఈ సందర్భంగా సదాశయ ఫౌండేషన్, మగువ లయన్స్ క్లబ్ సంయుక్తంగా నేత్రదాత నారాయణ సంస్మరణ సభ నిర్వహించారు. కుటుంబ సభ్యులకు సదాశయ ఫౌండేషన్ ద్వారా అభినందన పత్రం అందజేశారు. కార్యక్రమంలో 49వ డివిజన్ కార్పొరేటర్ ఖాజా సనా, ఫక్రొద్దీన్, సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు కే.ఎస్.వాసు, నూతి సురేశ్‌కుమార్, వంశీ, దప్పు శంకర్, ప్రసాద్‌తోపాటు కుటుంబ సభ్యులు శ్రీనివాస్-మాధవి, సత్యనారాయణ-మాధవి, కృష్ణ-స్వప్న, రేణుక-శ్రీనివాస్, నీలిమ-రంగయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సతీమణికి సన్మానం



సన్మానిస్తున్న కార్పొరేటర్ కౌశిక లత

రామగుండం: పట్టణంలోని శ్రీభక్తాంజనేయస్వామి ఆలయ సముదాయంలో ఉన్న అయ్యప్ప ఆలయంలో అన్నదానం కార్యక్రమానికి బుధవారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్ సతీమణి మనాలిఠాకూర్ హాజరయ్యారు. ఆమె అయ్యప్ప స్వాములకు అన్నం వడ్డించారు. అనంతరం ఆమెను కార్పొరేటర్ కౌశిక లత సన్మానించారు. బీఆర్‌ఎస్ నేత కౌశిక హరి, గురుస్వాములు ఉన్నారు.

కార్మికులకు పీఎఫ్‌తో భద్రత



మాట్లాడుతున్న అధికారి మోహన్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్: కార్మికులుగా పనిచేసే ప్రతి ఒక్కరూ పీఎఫ్ తప్పకుండా చేయించుకోవాలని ప్రావిడెంట్ ఫండ్ ఎన్‌రోల్‌మెంట్ అధికారి మోహన్‌రెడ్డి అన్నారు. పెద్దపల్లిలో బుధవారం రైల్వేగూడ్స్ షెడ్ ప్రాంతంలో రైల్వేహమాలీ కోఆపరేటివ్ సొసైటీ సభ్యులకు ప్రావిడెంట్ ఫండ్ ఆవశ్యకత, కార్మికులకు భద్రత, భరోసా, ఈసీఆర్ అంశాలపై అవగాహన కల్పించారు. నాయకులు వెంకట్‌రెడ్డి, సంపత్, మోహన్, వెంకటేశ్, శ్రీశైలం, రవి, రాజు, సతీశ్, వెంకటేశ్ ఉన్నారు.